లెక్చరర్ల క్రమబద్ధీకరణలో కాసుల దందా

కాంగ్రెస్ పాలనలో బయటపడ్డ మరో కుంభకోణం

- రూ.3.5 కోట్లు వసూలు చేసిన ముఠా సభ్యులు
- ఇటీవలే 23 మంది క్రమబద్ధీకరణ
- రెగ్యులరైజ్‌కు నోచుకోని 424 మంది లెక్చరర్లు
- ఇదే అదనుగా దందాకు తెరలేపిన అక్రమార్కులు

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మూడు స్కీములు.. ఆరు స్కాములు అన్నట్టుగా సాగుతున్నది. కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ పేరుతో రూ.3.5కోట్లు చేతులు మారాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయడం, రూ.68 లక్షలు పట్టుబడటం సంచలనంగా మారింది. ప్రస్తుతం ఈ ముఠా సభ్యులు పోలీసుల అదుపులో ఉన్నారు. కుంభకోణం ఓ మంత్రి, ఓ ముఖ్యనేత బంధువు పాత్ర ఉందని విచారణలో తెలిసింది. కాంట్రాక్ట్ లెక్చరర్ల స్కాం ప్రకంపనలు సృష్టిస్తున్నది. బయటపడ్డది కొంత మాత్రమేనని, భారీ స్కామ్ జరిగి ఉంటుందని లెక్చరర్లు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

చేతులు మారిన రూ.3 కోట్లు

కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ పేరుతో లెక్చరర్ల బలహీనతను ఆసరాగా చేసుకుని కొందరు కాసుల దందాకు తెరలేపారు. రెగ్యులరైజ్ చేయిస్తామంటూ ఓ ముఠా 30 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేసింది. ఇటీవలే ప్రభుత్వం 23 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసిం ది. విద్యాశాఖ బుధవారం జీవో 35 వెలువరించింది. క్రమబద్ధీకరించిన వారిలో తెలుగు, హిందీ, ఎకనామిక్స్, సివిక్స్, గణితం, కెమిస్ట్రీ, కామర్స్, బోటనీ లెక్చరర్లు ఉన్నారు. అయితే ముఠాకు డబ్బులిచ్చిన వారిలో కొందరు లెక్చరర్లకు రెగ్యులరైజ్ కాలేదు. దీంతో వారంతా ముఠాను నిలదీశారు. డబ్బులు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేయడంతో .. ఆ ముఠా తప్పించుకుని తిరుగుతున్నది. విసిగి వేసారిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ ముఠాను అరెస్టుచేసి, రూ.68లక్షలు స్వాధీనం చేసుకున్నారు. రెగ్యులరైజ్ పేరుతో రూ.3.5 కోట్ల వరకు వసూలు చేసినట్టుగా తెలుస్తున్నది.

పిల్లల మీద ప్రమాణం

ఏడాది క్రితం 5వేల మందికి పైగా లెక్చరర్లు, ఉద్యోగులను కేసీఆర్ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఇంటర్ విద్యలో ఉర్దూ లెక్చరర్లు 13 మంది, మరో 411 మంది ఒకేషనల్ కాంట్రాక్ట్ లెక్చరర్లు క్రమబద్ధీకరణకు నోచుకోలేదు. అభ్యర్థుల విద్యార్హతలు, పోస్టులు మంజూరు కాకుండానే కాంట్రాక్ట్ లెక్చరర్లను నియమించడం వంటి కారణాలతో వీరి రెగ్యులరైజేషన్‌ను అధికారులు పక్కనపెట్టారు. వీరంతా రెగ్యులరైజ్ అయ్యేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో వోకేషనల్ కాంట్రాక్ట్ లెక్చరర్లు రెండు గ్రూపులుగా ఏర్పడ్డారు. జీవో 12కు సంబంధించిన వారు 175 మంది ఒక గ్రూపుగా, జీవో 12తో సంబంధం లేని 236 మంది మరో గ్రూపుగా విడిపోయారు. ఒక ముఠా ఒక్కో లెక్చరర్ క్రమబద్ధీకరణకు రూ.10లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ రూ.10 లక్షలను నాలుగు దశల్లో ఇవ్వాలని షరతు విధించుకున్నారు. డబ్బులిచ్చిన విషయం బయటికి చెప్పవద్దంటూ పిల్లల మీద ప్రమాణం చేయించుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

అప్పుడు పారదర్శకం.. ఇప్పుడు అవినీతిమయం

కాంట్రాక్ట్ ఉద్యోగులను పారదర్శకంగా క్రమబద్ధీకరించిన ఘనత కేసీఆర్ సర్కారు సొంతం. ఒకే ఒక్క సంతకంతో ఎలాంటి ఆరోపణలు లేకుండా కేసీఆర్ సర్కారు 5,544 మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. ఇందులో 3,897 మంది ఉద్యోగులు విద్యాశాఖకు చెందిన వారే ఉన్నారు. వీరిలో అత్యధికంగా 2,909 జూనియర్ లెక్చరర్లుండగా, 184 జూనియర్ లెక్చరర్లు (ఒకేషనల్) ఉన్నారు. మరో 390 పాలిటెక్నిక్, 270 డిగ్రీ లెక్చరర్లు, సాంకేతిక విద్యాశాఖలో 131 అటెండర్లు, వైద్యారోగ్యశాఖలో 837 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, 179 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 158 మంది ఫార్మాసిస్టులు, కార్మిక ఉపాధి కల్పనశాఖలో 230 మంది సహాయ శిక్షణ అధికారులున్నారు. రెగ్యులరైజేషన్ సమయంలో ఇంటర్ విద్యలో 424 మంది రెగ్యులరైజ్ కాలేదు. ఇదే అదనుగా ప్రస్తుతం పెద్దల అండతో కొన్ని ముఠాలు వసూళ్ల దందాకు తెరలేపాయి.

పెద్దల హస్తంపై అనుమానాలు

కాంట్రాక్టు లెక్చరర్ల నుంచి కాసులు వసూలు చేసిన ముఠా వెనుక కొందరు పెద్దల హస్తం ఉన్నట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. ఓ మంత్రి, ముఖ్యనేత బంధువు చక్రం తిప్పినట్టు ప్రచారం జరుగుతున్నది. పోలీసులు పట్టుకున్న వారు విచారణలో వారి పేర్లు వెల్లడించినట్టు సమాచారం. సచివాలయంలో పనిచేసే కొంత మంది పాత్ర కూడా ఉందన్న అనుమానాలున్నాయి. ఈ ముఠానే కాకుండా మరికొన్ని లాబీ ముఠాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఒకేషనల్ లెక్చరర్ల నుంచి రూ.2 లక్షల చొప్పున వసూలు చేసిన ఓ నిందితుడు ఆ తర్వాత చేతులెత్తేసినట్టు తెలుస్తున్నది. వసూలు చేసిన సొమ్ముతో విల్లా కొనుక్కున్నానని, ఇప్పుడు తానేం చేయలేనంటూ తప్పించుకుని తిరుగుతున్నాడని సమాచారం.

టీ హబ్‌లో 'ఫిన్‌టర్ నెట్ యాక్సిలరేటర్'

ఏఐ, వెబ్ 3 స్టార్టప్‌లకు ప్రోత్సాహం

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధస్సు, వెబ్ 3 టెక్నాలజీతో ఆవిష్కరణలు చేసే స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు టీ హబ్‌లో ఫిన్‌టర్ నెట్ యాక్సిలరేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కొత్తగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో రకరకాల సమస్యలను పరిష్కరించేందుకు పని చేస్తున్న స్టార్టప్‌లకు యాక్సిలరేటర్ ద్వారా పూర్తి స్థాయిలో సహకారం ఉంటుందని టీ హబ్ నిర్వాహకులు తెలిపారు. ఎక్స్‌డీసీ నెట్‌వర్క్ భాగస్వామ్యంతో స్టార్టప్‌లను ప్రారంభ దశ నుంచి మార్కెట్లోకి వెళ్లే వరకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సాయాన్ని ఫిన్‌టర్‌నెట్ యాక్సిలరేటర్ ద్వారా అందిస్తామని తెలిపారు. ఔత్సాహికులు మరిన్ని వివరాలకు టీ హబ్‌ను సంప్రదించాలని తెలిపారు

అంబులెన్స్‌లో ఉత్సవానికి వెళ్లిన కేంద్రమంత్రిపై కేసు

తిరువనంతపురం, నవంబర్ 3: కేంద్ర సహాయ మంత్రి, మలయాళ సినీ స్టార్ సురేశ్ గోపిపై కేరళ పోలీసు కేసు నమోదుచేశారు. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపారని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారని, అంబులెన్స్‌ను దుర్వినియోగం చేశారని పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో త్రిస్సూర్‌లో జరిగిన వేడుకకు సురేశ్ గోపి అంబులెన్స్‌లో హాజరుకావటం వివాదాస్పదమైంది. దీనిపై ఓ కమ్యూనిస్ట్ నాయకుడి నుంచి కేరళ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో సురేశ్ గోపిని మొదటి నిందితుడిగా, అంబులెన్స్ డ్రైవర్‌ను మూడో నిందితుడిగా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నది.

ప్రపంచ కుబేరుల్లో రెండోస్థానానికి బెజోస్

న్యూఢిల్లీ: అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో రెండో స్థానంలో ని లిచారు. ఆయన సంపద విలువ 220 బిలియన్ డాలర్లు (రూ.18,50,945కోట్లు). టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ 262 బిలియన్ డాలర్లు (రూ.22,04,307 కోట్లు) సంపదతో ప్రథమ స్థానంలో ఉన్నారు. మూడో స్థానంలో ఉన్న మెటా చీఫ్ మార్క్ జుకర్‌బర్గ్ సంపద విలువ 201 బిలియన్ డాలర్లు (రూ.16,91,090 కోట్లు).

బాబోయ్ పెద్దపులి!

- రెండు వారాలుగా నిర్మల్ జిల్లాలో సంచారం
- భయాందోళనలో రైతులు, అటవీ శివారు ప్రజలు
- పాదముద్రలను గుర్తించిన అటవీ అధికారులు

నిర్మల్ జిల్లాలోని ఓలా అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాను బిగిస్తున్న అటవీ శాఖ సిబ్బంది(ఫైల్)

కుంటాల/హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో రోజుకో చోట పులుల సంచారం వెలుగులోకి వస్తున్నది. అటవీ సమీపంలోని జిల్లాల్లో ఇటీవల పులుల సంచారం పెరిగింది. దీంతో అక్కడి ప్రాంతాల ప్రజలు, రైతులు భయాందోళనతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. రెండు వారాలుగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పులి సంచరిస్తుండగా.. వారం క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో కనిపించింది. తాజాగా నిర్మల్ జిల్లాలో పులి కదలికలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కుంటాల మండలంలో పులి సంచరిస్తుండటంతో ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. మండలంలోని సాయన్న తన పొలంలో పులిని చూసి భయంతో పరుగులు పెట్టాడు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. రంగంలోకి దిగిన అధికారులు పులి జాడ కోసం గాలిస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నుంచి సూర్యాపూర్ అటవీ ప్రాంతంలోకి పులి వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఖైంసా రేంజ్ ఫారెస్ట్ అధికారులు పులి పాదముద్రలను గుర్తించారు. పులి జాడ కోసం కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. చెరువు వద్దకు వచ్చి పులి వెళ్లినట్టు కెమెరాలో కనిపించింది. పశువుల కాపరులు రాములు, చిన్నయ్య ఆదివారం మళ్లీ పెద్ద పులిని చూశారు. గేదెలకు నీళ్లు తాగించడానికి ఓలా బీట్ అడవిలోని చెరువు వైపు వస్తుండగా పులి ఓ గేదెను చంపేందుకు వెంబడించింది. కేకలు వేయడంతో పారిపోయింది. ప్రాణ రక్షణ కోసం రాములు చెట్టు ఎక్కగా చిన్నయ్య దూరంగా పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. వీరు గ్రామస్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించగా గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని సురక్షితంగా ఇంటికి తీసుకొచ్చారు. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వగా ఖైంసా ఎఫ్ఆర్‌వో వేణుగోపాల్ నేతృత్వంలో ఎఫ్ఎస్‌వోలు లక్ష్మణ్, కీర్తి, డీఆర్‌వో శంకర్, ఈబీవో గ్రామస్థులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

విధులా ? విడాకులా ?

బెటాలియన్ పోలీసుల ఆవేదన

- కాంగ్రెస్ సర్కారు నిర్వాకంతో కుటుంబాలకు కానిస్టేబుళ్ల దూరం
- భార్య, పిల్లలతో గడపలేని దుస్థితి
- బెటాలియన్‌లో తప్పని వెట్టి చాకిరీ
- ఒకే రాష్ట్రం-ఒకే పోలీస్ కావాలని డిమాండ్

డిచ్‌పల్లిలోని 44వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బెటాలియన్ పోలీసు కుటుంబాలు (ఫైల్)

డిచ్‌పల్లి, నవంబర్ 3: 'చెప్పుకోవడానికే పోలీసు ఉద్యోగం.. చేసేది మాత్రం వెట్టిచాకిరి. గడ్డి తీయాలి, రాళ్లు ఎత్తాలి.. సెలవుల్లేకుండా పని చేయాలి. కుటుంబాలకు దూరంగా ఉండాలి. మా సమస్యలు చూడలేక ఇంటోళ్లు విడాకులు ఇచ్చి వెళ్లిపోతామంటున్నారు. పెండ్లికాని కానిస్టేబుళ్లకేమో పిల్లనిస్తలేరు'.. ఇదీ బెటాలియన్ పోలీసులు ఆవేదన. ఈ వ్యవస్థ మారాల్సిందే.. రాష్ట్రమంతా ఒకే పోలీసు విధానం అమలు చేయాల్సిందే అంటూ రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం 13 బెటాలియన్లు పని చేస్తున్నాయి. ప్రతీ బెటాలియన్‌లో 1500 మంది సిబ్బంది ఉంటారు. వారిలో 200 మందిని హెడ్‌క్వార్టర్స్‌కు పరిమితం చేసి మిగిలిన వారిని బెటాలియన్ పరిధిలోని పోలీసుస్టేషన్లకు 33 శాతం చొప్పున తరచూ మారుస్తూ ఉంటారు. ఎవరు.. ఎప్పుడు.. ఏ పోలీస్‌స్టేషన్‌లో ఉంటారో తెలియదు. గతంలో బెటాలియన్‌లో పనిచేసే ఉద్యోగులకు నెలకు 15 రోజుల విధులు నిర్వహించిన తర్వాత, వరుసగా నాలుగు రోజులు సెలవులు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ రూల్స్ మార్చి, 26 రోజులు పని చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. కొత్త ఆదేశాల కారణంగా రోజుల తరబడి ఇంటికి దూరమవ్వాల్సి రావడాన్ని కుటుంబసభ్యులు అంగీకరించడం లేదు. ఈ క్రమంలోనే 'మీరు విధుల పేరిట ఊర్లు తిరగండి. మేం విడాకులు ఇచ్చి వెళ్లి పోతామని' భార్యలు హెచ్చరిస్తున్నారని కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, బెటాలియన్‌లో చేసే వెట్టి చాకిరిని చూసి, పెండ్లి కాని సిబ్బందికి పిల్లను ఇవ్వడానికి ముందుకే రావడంలేదని చెబుతున్నారు. ఈ పరిస్థితి మారాల్సిందేనన్న భావనతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని బెటాలియన్ల లోనూ కానిస్టేబుళ్లు, వారు కుటుంబ సభ్యులు నిరసనలకు దిగుతున్నారు.

రేవంత్‌ని గెలిపించింది ఇందుకేనా?

మా కొడుకు పది రోజులకోసారి ఇంటికొస్తుండే. ఇప్పుడు 26 రోజుల కొకసారి ఇంటికి వస్తుండు. ఏమైంది అని అడిగితే సెలవులు తగ్గించిండ్రని చెప్పిండు. బిడ్డల్ని ఇబ్బంది పెట్టేందుకేనా రేవంత్‌రెడ్డిని సీఎంను చేసింది? మా పిల్లలు ఆఫీసర్లకు మందు కలిపి ఇవ్వాల్నా? గిదేనా పోలీసు ఉద్యోగమంటే?

– ఓ బెటాలియన్ కానిస్టేబుల్ తల్లి

మూడు నెలలకో పోస్టింగా?

ఒక రాష్ట్రంలో ఒకే పోలీసు విధానం ఉండాలి. ఇదేం పద్ధతి? మూడు నెలలకోసారి పోస్టింగ్ మార్చుకుంటపోతే మా పిల్లల చదువులు ఏం కావాలి? భర్తలతో కలిసి ఉండే హక్కు మాకు లేదా? మావోళ్ల సమస్యలు తీర్చాలని కుటుంబాలు రోడ్డెక్కితే, భర్తలను సస్పెండ్ చేసుడేంది? సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– ఓ కానిస్టేబుల్ భార్య

ఒకే చోట ఐదేండ్లుండాలి

బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాల బాధలు ఎవరికీ చెప్పుకోలేనివి. పిల్లలు తండ్రి ప్రేమకు నోచుకోక మనోవేదనకు గురవుతున్నారు. మా ఆయన డ్యూటీపై ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు వెళ్తే, ఏదైనా ఆపద వస్తే ఆదుకునే వారుండరు? ఐదేండ్లు ఒకేచోట పని చేసేలా చర్యలు తీసుకోవాలి.

– మరో కానిస్టేబుల్ భార్య డిమాండ్

నేడు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్, తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ సంయుక్తాధ్వర్యంలో ఎస్సీ యువతకు పలు మెడికల్ కోర్సుల్లో ఉచిత ఉపాధి శిక్షణ ఇవ్వనున్నారు. దీంతో అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను సోమవారం నిర్వహించనున్నారు. ప్రాజెక్టు మేనేజర్ సైదులు శనివారం ప్రకటన విడుదల చేశారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్, కంప్యూటర్ ఆపరేటర్, ఫిజియోథెరపి టెక్నిషియన్, అసిస్టెంట్ డయాలసిస్ టెక్నిషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరిలో కొనసాగనున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అభ్యర్థులు నేరుగా సంబంధిత విద్యార్హత పత్రాలతో రావాలని సూచించారు. వివరాలకు 9848 581100, 9704782992లలో సంప్రదించాలని సూచించారు.

స్పెయిన్ రాజ దంపతులకు అవమానం

ముఖంపై బురద జల్లిన వరద బాధితులు

మాడ్రిడ్, నవంబర్ 3: వరదల కారణంగా నష్టపోయిన పపోరాట పట్టణంలో బాధితుల పరామర్శకు వెళ్లిన స్పెయిన్ రాజ కుటుంబానికి తీవ్ర అవమానం జరిగింది. తీవ్ర ఆగ్రహంతో ఉన్న బాధితులు ఆదివారం రాజు ఫిలిప్ 6, రాణి లెతిజియా ముఖాలపై బురద జల్లారు. దీంతో రాజు, రాణి ముఖాలు, దుస్తులు బురదతో నిండిపోయాయి. పక్కన ఉన్న అంగరక్షకులు గొడుగులు అడ్డుపెట్టి ఆపడానికి చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. తమను 'హంతకులు' అని నిందించడమే కాక, పరుష పదజాలంతో తూలనాడుతున్న బాధితులతో రాజ దంపతులు మాట్లాడటానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా బాధితులు ప్రధాని పెడ్రో శాంచెజ్, వేలన్సియా రీజియన్ హెడ్ కార్లోస్ మేజన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మేజన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా, వారం క్రితం పపోరాటాలో సంభవించిన భారీ వరదల కారణంగా భారీ ఆస్తి నష్టంతో పాటు 200 మందికి పైగా పౌరులు మరణించారు. తమను ప్రభుత్వం ఆదుకోలేదని బాధితులు ఆగ్రహంతో ఉన్నారు.

భూమాత.. సాగదీత!

- కొత్త ఆర్వోఆర్ చట్టంపై నాన్చుతున్న ప్రభుత్వం
- ముఖ్యమంత్రి నుంచి ఇంకా రాని క్లియరెన్స్
- అటెన్షన్ డైవర్షన్ కోసమే కొత్త చట్టమని అనుమానాలు

ధరణి

హైదరాబాద్, నవంబర్ 3: (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌ను ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ కేవలం తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నది. అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో పడేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా నేతలంతా ఎన్నికల సభల్లో ప్రచారం చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సైతం ధరణిపై విమర్శలు ఆపలేదు. పూర్తిగా పోర్టల్‌ను తీసేయడం సాధ్యం కాదని బీఆర్ఎస్ ముందు నుంచీ చెప్తుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం చివరికి అదే ఒప్పుకున్నది. పోర్టల్‌ను పూర్తిగా తీసేయకుండా, అవసరమైన మార్పులు చేస్తామని, పేరు మారుస్తామని చెప్పింది. ఆ తర్వాత తమకు అవసరమైన ప్రతిసారీ రైతుల అటెన్షన్ డైవర్షన్ కోసం ధరణిని కూడా తెరమీదికి తెస్తున్నది. పది నెలలుగా హడావుడి చేస్తున్నది. మొదట ఐదుగురు సభ్యులతో ధరణి అధ్యయన కమిటీని నియమించింది. కమిటీ పేరు చెప్పి దాదాపు రెండున్నర నెలలపాటు దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పూర్తిగా పక్కన పెట్టేసింది. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల హడావుడి మొదలు కావడంతో.. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు 'స్పెషల్ డ్రైవ్' చేపడతామని ప్రకటించింది. తొమ్మిది రోజుల్లోగా దరఖాస్తులన్నీ పరిష్కరిసామని చెప్పింది. ఆ తరువాత గడువు పొడిగించింది. గడువు పూర్తయ్యేలోగా ఎన్నికల కోడ్ రావడంతో పరిష్కార ప్రక్రియ అటకెక్కించింది. భూ సమస్యలు పరిష్కరిస్తున్నామంటూ పార్లమెంట్ ఎన్నికల్లోనూ ప్రచారం చేసుకున్నది.

అదిగో చట్టం.. ఇదిగో భూమాత!

ధరణి కమిటీ సమావేశాలు కొనసాగుతుండగానే, పూర్తి నివేదిక ఇవ్వకముందే ప్రభుత్వం తమ అనుకూల మీడియా ద్వారా కొత్త చట్టం సిద్ధమైందని, భూమాత పేరును అమలు చేస్తున్నారంటూ ప్రచారం చేసింది. రుణమాఫీ పూర్తి చేస్తామన్న హామీ నెరవేర్చకపోవడం, రైతు బంధు వేయకపోవడం వంటి కారణాలతో ఆగస్టులో రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ సమయంలో అటెన్షన్ డైవర్షన్ కోసం మరోసారి ధరణిని వాడుకున్నది. కొత్త ఆర్వోఆర్ చట్టం ముసాయిదాను విడుదల చేసింది. నెల రోజులపాటు సలహాలు, సూచనలు స్వీకరిస్తామని చెప్పింది. ఆ తర్వాత అమల్లోకి తెచ్చి రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామని ప్రచారం చేసింది. ఆ గడువు పూర్తయిన తర్వాత సెప్టెంబర్‌లో కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని సిద్ధం చేశారు. కానీ, ఆ తర్వాత కొన్నాళ్లపాటు మరుగున పడేశారు. తాజాగా ధాన్యం కొనుగోళ్ల అంశం తెరమీదికి రావడం, ప్రభుత్వం విఫలం కావడంతో అటెన్షన్ డైవర్షన్ కోసం మరోసారి ధరణిని వాడుకున్నారు. మూడు రోజుల కిందట జరిగిన క్యాబినెట్ సమావేశంలో కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని ఆమోదిస్తారని, పోర్టల్ పేరును భూమాతగా మారుస్తారని, ఆర్డినెన్స్ తెస్తారని లీకులు ఇస్తూ విపరీతంగా ప్రచారం చేశారు. కానీ, కొత్త ఆర్వోఆర్ చట్టంపై ఇప్పటివరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బ్రీఫింగ్ ఇవ్వలేదని సమాచారం. రెవెన్యూ శాఖ అధికారులు సీఎంవో అధికారులకు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చట్టం గురించి వివరించారని చెప్తున్నారు. మంత్రి నుంచి సీఎంకు బ్రీఫింగ్ జరగలేదని తెలుస్తున్నది. అయినా చట్టాన్ని ఆమోదిస్తారంటూ డైవర్షన్ కోసం హడావుడి చేశారని చెప్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ధరణిపై సైలెంట్‌గా ఉన్నదని, ఈ ఏడాది చివర్లో రైతుభరోసా వేయాల్సి ఉంటుందని, ఆ సమయంలో మరోసారి రైతుల అటెన్షన్ డైవర్షన్ కోసం ధరణిని వాడుకుంటారని విమర్శిస్తున్నారు.

పెండింగ్‌కు మోక్షమేది?

ధరణిలో రెండున్నర లక్షల పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయని, వాటిని తొమ్మిది రోజుల్లో పరిష్కరిస్తామని ప్రభుత్వం మార్చి 1న ప్రకటించింది. అప్పటినుంచి ఇప్పటివరకు వాటి పరిస్థితి ఏమిటో రెవెన్యూ శాఖ చెప్పుకోలేని పరిస్థితి. లక్షకుపైగా దరఖాస్తులు పరిష్కరించామని చెప్పుకుంటున్నా, అవన్నీ అక్షర దోషాల సవరణ, ఖాతాల మెర్జింగ్ వంటి చిన్నచిన్న పనులేనని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. రైతులు ఎదుర్కొంటున్న అసలు సమస్యలన్నీ పెండింగ్‌లో ఉన్నాయని రెవెన్యూ వర్గాలే వెల్లడిస్తున్నారు. వాటిని పరిష్కరిస్తే పట్టాదారుల సంఖ్య, భూ విస్తీర్ణం భారీగా పెరుగుతుందని పేర్కొంటున్నాయి. దీంతో రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలకు వ్యయం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్టు చర్చ జరుగుతున్నది. అందుకే వాటి పరిష్కారంపై దృష్టిపెట్టడం లేదని అంటున్నారు.

విద్యుత్తు షాక్‌తో ఇద్దరు సెక్యూరిటీ గార్డుల మృతి

మణుగూరు గ్రేస్ మిషన్ స్కూల్‌లో ఘటన

ఉపేందర్ (ఫైల్)

మణుగూరు టౌన్, నవంబర్ 3: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని గ్రేస్‌మిషన్ పాఠశాలలో ఆదివారం విద్యుత్తు షాక్ తగిలి ఇద్దరు సెక్యూరిటీ గార్డులు మృతిచెందారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం కాళీమాత ఏరియాకు చెందిన ఉపేందర్, రత్నం పట్టణ పరిధిలోని గుట్టమల్లారం గ్రేస్ మిషన్ పాఠశాలలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. ఆదివారం పాఠశాల గోడకు అమర్చిన ఐరన్ పైపులు తొలగిస్తుండగా విద్యుత్తు తీగలకు తగలడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురయ్యారు. ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీశ్‌కుమార్, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఉపేందర్, రత్నం మృతి బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. విషయం తెలుసుకున్న ఆయన పాఠశాలను సందర్శించారు. గ్రేస్ మిషన్ స్కూల్ యాజమాన్యం నష్ట పరిహారం చెల్లించి వారి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

- నిందితుడికి దేహశుద్ధి చేసిన స్థానికులు
- మధ్యాహ్నం ఘటన జరిగితే సాయంత్రం ఫిర్యాదు స్వీకరణ
- ఎట్టకేలకు పోక్సో కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు
- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పార్కులో ఘటన

మహబూబ్‌నగర్, నవంబర్ 3: పార్కులో ఆడుకుంటున్న బాలికపై పట్టపగలే ఓ యువకుడు లైంగికదాడికి యత్నించాడు. స్థానికులు గమనించి అతడికి దేహశుద్ధి చేసి వదిలేశారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని పిస్తాహౌస్ సమీపంలో ఉన్న పార్కులో బాలిక(3).. తోటి బాలబాలికలతో కలిసి ఆడుకుంటున్నది. పిస్తాహౌస్‌లో పనిచేస్తున్న వెస్ట్‌బెంగాల్‌కు చెందిన రిజ్వాన్ ఆదివారం మధ్యాహ్నం 1:20 నిమిషాల సమయంలో బాలికను పక్కకు తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించాడు. గమనించిన తోటి పిల్లలు రోడ్డుపై వెళ్తున్న మెడికల్ కాలేజీ విద్యార్థులకు చెప్పారు. రిజ్వా న్ బాలిక గొంతు నులిమే ప్రయత్నం చేస్తుండగా.. మెడికల్ విద్యార్థులు బాలికను రక్షించారు. నిందితుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఘటనపై యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ పోలీసులు వచ్చి రిజ్వాన్‌ను స్టేషన్‌కు తరలించారు. అయినా.. కేసు నమోదు చేయడంలో పోలీసులు తాత్సారం చేశారు. పైగా నిందితుడికి మతిస్థిమితం లేదని బాధిత కుటుంబసభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ విషయం జిల్లా కేంద్రమంతటా వ్యాపించడంతో పోలీసులు సాయంత్రం 6 గంటల తర్వాత బాధితులను స్టేషన్‌కు పిలిపించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు రూరల్ సీఐ గాంధీనాయక్ తెలిపారు.